క్లుప్తంగా

పోతయ్యవలసలో వైద్య శిబిరం



రోగిని పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

లావేరు: ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని పెదలింగాలవలస వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ఎంఎల్‌హెచ్‌పీ స్వర్ణలత అన్నారు. గ్రామంలో శనివారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రోగులకు వైద్య తనిఖీలు చేసి మందులు అందజేశారు. ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మాజీ సర్పంచ్ చిలకలపల్లి పరందామయ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయమూర్తికి సత్కారం



అనుపమ చక్రవర్తిని కలిసి అసోసియేషన్ సభ్యులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయానికి శనివారం వచ్చిన తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.అనుపమ చక్రవర్తిని శ్రీకాకుళం బార్ అసోసియేషన్ సభ్యులు, బీసీ న్యాయవాదుల సంఘం సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు, ప్రతినిధులు ఉన్నారు.

ముగిసిన సంగీత శిక్షణ శిబిరం



ధ్రువపత్రాలతో చిన్నారులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక మొండేటివీధిలోని షిర్డీసాయి సంగీత విద్యాలయం ఆధ్వర్యంలో నెలరోజులుగా నిర్వహించిన వేసవి సంగీత శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. శిక్షకురాలు మల్లెమొగ్గల లక్ష్మి నేతృత్వంలో శిక్షణ పొందిన విద్యార్థులకు ధ్రువ పత్రాలను అందజేశారు.

అభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న ప్రసాదరావు

జి.సిగడాం: గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించాలని డీసీఎంఎస్ డైరెక్టర్ నక్క ప్రసాదరావు కోరారు. గెడ్డకంచరాం గ్రామంలో శనివారం ఏర్పాటు చేసి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువేయ్యేలా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది చూడాలన్నారు. పంచాయతీ కార్యదర్శి కూనిబిల్లి కోటి, వీఆర్వో పొట్నూరు జగన్నాథం, ఇంజినీరింగ్ అసిస్టెంట్ గిడిజాల వెంకటేష్ పాల్గొన్నారు.

వేడుకగా విగ్రహ ప్రతిష్ట



తీర్థ ప్రసాదాలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: బంటుపల్లి పంచాయతీ కంబాలపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠామహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పాల్గొని పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, ఏపీ సాధు పరిషత్ అధ్యక్షులు శ్రీనివాసానంద సరస్వతి, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం మరమ్మతులు చేపడుతున్న కారణంగా సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఏఈ కె.హరికృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఫరీదుపేట, ఎచ్చెర్ల, ఎస్ఎస్ఆర్ పురం, ఎస్ఎంపురం, జరజాం, చిలకపాలెం, కింతలిమిల్లు ప్రాంతాలకు సరఫరా ఉండదని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నారాయణ తిరుమల హుండీల లెక్కింపు రేపు

శ్రీకాకుళం కల్చరల్: గుజరాతీపేటలోని నారాయణ తిరుమల దేవాలయం హుండీలను ఈ నెల 12వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు తెరచి ఆదాయాన్ని లెక్కించనున్నట్లు ఈవో శ్యామలరావు శనివారం తెలిపారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, ప్రధాన అర్చకులు, దేవదాయశాఖ అధికారులు, ప్రజల సమక్షంలో ఆదాయం లెక్కింపు ప్రక్రియ చేపడతామన్నారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు

- మంత్రి ధర్మాన ప్రసాదరావు
- 175 మందికి ఇళ్ల పట్టాల అందజేత



మంత్రి ధర్మానతో పట్టాదారులు

శ్రీకాకుళం రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అర్హులందరికీ ఇళ్లను మంజూరు చేస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చెప్పారు. గత ప్రభుత్వాలు పేదలను పట్టించుకోలేదన్నారు. పెదపాడులోని క్యాంప్ కార్యాలయంలో రాగోలు పంచాయతీ బావాజీపేటకు చెందిన 175 మంది నిరుపేదలకు శ్రీకాకుళం మండల తహసీల్దార్ ఎస్.వెంకట్రావు అధ్యక్షతన ఇళ్ల స్థలా పట్టాలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన మాట్లాడుతూ..వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా 32 లక్షల మందికి రూ. 12 వేల కోట్లు ఖర్చుచేసి భూమిని కొనిగోలు చేసి పట్టాలను ఇచ్చామన్నారు. చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసినప్పటికీ ఒక్క సెంటు భూమి కూడా ఎక్కడా కొనుగోలు చేయలేదన్నారు. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పని చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ పంచాయతీ విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు రుప్ప దివ్య, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చిట్టి జనార్దనరావు, రాగోలు సర్పంచ్ గేదెల శంగల్వరావు, ఏఎంసీ చైర్మన్ మూకళ్ల తాతబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు గుండ కృష్ణ, చిట్టి రవికుమార్, యజ్జల గురుమూర్తి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యం



మాట్లాడుతున్న చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యమని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. ఎస్ఎంపురంలో శనివారం పల్లెపల్లెకు ఎంపీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రజల జీవన ప్రమాణాలు, మహిళా సాధికారితకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సంక్షేమం దండుగ అన్న చంద్రబాబు ఇప్పుడు తప్పుడు మ్యానిఫెస్టోలతో ప్రజలను తప్పుతోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని.. వీటిని ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. ఎస్ఎంపురం పంచాయతీలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత స్వయం సహాయ సంఘాల మహిళలకు రూ. 6.19 కోట్లు ప్రయోజనం చేకూరిందన్నారు.

కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు మాడుగుల మురళీధర్‌బాబా, సర్పంచ్ కోన సూర్యారావు, ఎంపీటీసీ సభ్యులు కింతలి ఈశ్వరరావు, కూన ఈశ్వరమ్మ, పీఏసీఎస్ అధ్యక్షులు సనపల నారాయణరావు, కార్పొరేషన్ డైరెక్టర్లు నక్క కృష్ణమూర్తి, కేవీవీ సత్యనారాయణ, నాయకులు అలికాన భాస్కరరావు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి



శ్రీకాకుళం అర్బన్: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం



లావేరు: మాట్లాడుతున్న శ్రీనివాసరావు

లావేరు: విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని చదవాలని మురపాక శాఖాగ్రంథాలయాధికారి ఎం.శ్రీనివాసరావు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గ్రంథాలయంలో విద్యార్థులకు శనివారం నైతిక విలువలు, సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలన్నారు. గ్రంథాలయ సహాయకుడు పి.షణ్ముఖరావు ఉన్నారు.

శ్రీకాకుళం అర్బన్: పోటీ పరీక్షల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో ఉల్లాసాన్ని నింపుతాయని కవి భోగెల ఉమామహేశ్వరరావు అన్నారు. బలగ గ్రంథాలయంలో పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చదువుతోపాటు క్రీడలు, సంగీతం, వినోదం అవసరమన్నారు. సంగీతం మాస్టారు ఎస్.ఈశ్వరరావు, గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేన, సహాయకురాలు అనిత ఉన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన



భూమి పూజ చేస్తున్న వెంకటరమణ

జి.సిగడాం: వెలగాడ పంచాయతీ నుంచి గొలుసుపూడి గ్రామం వరకు గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ కృషితో ప్రత్యేక నిధులు మంజూరయ్యావని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ అన్నారు. రోడ్డు నిర్మాణ పనులకు శనివారం భూమి శంకుస్థాపన చేశారు. గతంలో ఈ పంచాయతీలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే దృష్టికి రహదారి సమస్యను గ్రామస్తులు తీసుకొచ్చిన నేపథ్యంలో నిధులను కేటాయించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గొలుసుపూడి నారాయణరావు, పెద్ది వెంకటరమణ, పెద్ది శ్రీనివాసరావు, మచ్చ నరసయ్య, పిడుగు అమ్మారావు, బాలి అప్పలసూరి ఉన్నారు.

జీవితాన్ని సక్రమంగా మలచుకోవాలి



పుస్తకావిష్కరణలో మంత్రి ధర్మాన తదితరులు

- మంత్రి ధర్మాన ప్రసాదరావు



సినీగీతాలు ఆలపిస్తున్న గాయకులు

శ్రీకాకుళం కల్చరల్: ప్రతి వ్యక్తి తమ జీవితాన్ని ప్రయోజనకరంగా తీర్చి దిద్దుకోవాలని.. అందుకు రచయిత అప్పన్న జీవితం ఉదాహరణ అని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. స్థానిక బాపూజీ కళామందిర్‌లో డాక్టర్ నిక్కు అప్పన్న రచించిన వ్యాస మంజరి పుస్తకావిష్కరణ, ఎస్పీబాలు 77వ జయంతి వేడుకలు శనివారం జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవితాన్ని ప్రణాళికాబద్ధంగా మార్చుకుంటూ పది మందికి ఉపయోగపడే పనులను అప్పన్న చేస్తూ మానసిక ఉల్లాసాన్ని పొందుతున్నారన్నారు. ముందుగా కళామందిర్ ఆవరణలో ఉన్న గాయకుడు బాలసుబ్రహ్మణ్యం విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వ్యాసమంజి పుస్తకాన్ని ఆవిష్కరించారు. పుస్తక సమీక్షను పైడి హరనాథరావు నిర్వహించారు. అలాగే ప్రముఖ కార్డియాలజిస్టు జి.ఎస్.ఆర్ మూర్తి, నేత్రవైద్యనిపుణులు పి.ఎల్.ఎస్.రాజు, చిన్నపిల్లల వైద్యులు డి.లక్ష్మీనారాయణ, వైద్యులు ఎం.చిన్నబాబు, డాక్టర్ ఎం.యుగంధర్‌లను మంత్రి చేతుల మీదుగా సత్కరించారు. అలాగే రచయిత నిక్క అప్పన్న దంపతులను రెడ్‌క్రాస్ తరఫున సత్కరించారు. కార్యక్రమంలో కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అందవరపు సూరిబాబు, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, పి.రజనీకాంతరావు, కళాప్రవీణ బండారు చిట్టిబాబు, బలివాడ మల్లేశ్వరరావు, పట్నాల శ్రీనివాసరావు, వి.జగన్నాథంనాయుడు, మండవిల్లి రవి, సురంగి మోహనరావు, ఇప్పిలి శంకరశర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గానం చేసిన పలు గీతాలాపన కార్యక్రమాన్ని కె.ఎల్.ఎన్ మూర్తి, కె.రామ్మోహనరావు నిర్వహించారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకున్న స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని డీసీసీబీ కాలనీలో ఉన్న భూ సమేత వేంకటేశ్వరుని స్వామి దర్శనానికి శనివారం భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. స్వామికి ప్రీతికరమైన వారం కావడంతో ప్రత్యేక అష్టోత్తర శతనామాలతో పూజలు, ప్రత్యేక, ఉచిత దర్శనాలు కల్పించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు చామర్తి గోపాలాచార్యులు భక్తుల గోత్రనామాలతో అర్చనలు చేయించారు.

ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని చిన్నబజారులో వేంచేసిన వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం శ్రవణం నక్షత్రం సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు శ్రీనివాసాచార్యులు స్వామివారిని తులసి, పూల మాలలతో అందంగా అలంకరించగా భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

ఆ టీచర్లు బదిలీల కోసం నేడు హాజరు కావాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో పనిచేస్తున్న ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్లు, ఆర్ట్స్, డ్రాయింగ్, డబ్ల్యూఐ, ఎంటీఐ, మ్యూజిక్ ఉపాధ్యాయులు బదిలీల కోసం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్దకు ఆదివారం హాజరు కావాలని డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య తెలిపారు. తప్పనిసరి బదిలీల పరిధిలో ఉన్నవారితోపాటు రిక్వెస్ట్ బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఉదయం 10 గంటలకు సర్టిఫికెట్లతో రావాలని శనివారం ఓ ప్రకటలో పేర్కొన్నారు.

చిరు ధాన్యాల సాగుపై అవగాహన

జి.సిగడాం: రైతులు అధిక దిగుబడులు సాధించాలంటే సేంద్రియ ఎరువులు, ద్రావణాలు, కషాయాలను వినియోగించాలని ప్రకృతి వ్యవసాయ నేచురల్ మాస్టర్ ట్రైనర్ రాజేశ్వరమ్మ అన్నారు. ముషినివలస గ్రామంలో చిరుధాన్యాల సాగు, వాటి లాభాలపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. స్థానికంగా లభించే సహజ వనరులను వినియోగించి వివిధ ద్రావణాలు, కషాయాలను తయారు చేసుకుంటే సుస్థిర వ్యవసాయంతో సురక్షిత ఆరోగ్యం సాధించుకోవచ్చున్నారు.

గురుకులంలో చేరేందుకు రేపటి నుంచి కౌన్సెలింగ్

ఎచ్చెర్ల క్యాంపస్: ఎస్ఎంపురం ఏపీ గురుకులంలో ప్రవేశాలకు సోమవారం నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. 5, 6, 8 తరగతుల్లో ప్రవేశ పరీక్ష మెరిట్ ఆధారంగా విద్యార్థులకు అవకాశం కల్పిస్తామన్నారు. ప్రవేశ పరీక్ష గత నెల 20వ తేదీన నిర్వహించగా.. ఈ నెల ఎనిమిదో తేదీన ఫలితాలు వెలువడ్డాయన్నారు. విద్యార్థులు షెడ్యూల్ మేరకు పాఠశాలల్లో చేరాలన్నారు. మెరిట్ విద్యార్థులకు వ్యక్తిగతంగా సమాచారం చేరవేశామన్నారు.

కొనసాగుతున్న రాజశ్యామల అమ్మవారి యాగం

లావేరు: పెదలింగాలవలస గ్రామంలో సర్పంచ్ లుకలాపు యశోద, ఏఎంసీ మాజీ డైరెక్టరు లుకలాపు అప్పలనాయుడు దంపతులు నిర్వహిస్తున్న రాజశ్యామల అమ్మవారి యాగం శనివారం కూడా కొనసాగింది. విశాఖ శారద పీఠం కన్వీనర్ ఆరవెల్లి సూర్యనారాయణశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు వేద మంత్రాలు నడుమ పూజలు చేశారు. ఆదివారం యాగం ముగింపు సందర్భంగా భక్తులకు అన్న ప్రసాదాన్ని వితరణ చేస్తున్నట్లు అప్పలనాయుడు తెలిపారు.

నాడు-నేడు పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

- ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: ప్రభుత్వ పాఠశాలలకు సరికొత్త రూపు తీసుకువచ్చిన నాడు-నేడు పనులను శరవేగంగా పూర్తి చేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో నియోజకవర్గస్థాయిలో నాడు-నేడు ఫేజ్-1, 2 పనులపై ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫేజ్-2లో నాలుగు మండలాల్లో 183 పాఠశాలలకు రూ. 4.62 కోట్లు నిధులు మంజూరైనట్టు చెప్పారు. త్వరితగతిన పనులు పూర్తి చేస్తే అదే స్థాయిలో బిల్లులు విడుదల అవుతాయని చెప్పారు. విద్యావ్యవస్థను బలోపేతం చేసే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నూతన సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. పిల్లల చదువులు ఉన్నతంగా ఉండాలనే అకాంక్షతో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియాన్ని సీఎం జగన్ ప్రవేశ పెట్టారన్నారు. నాడు-నేడు పనులను స్కూల్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సమన్వయంతో పూర్తి చేయించాలన్నారు. జగనన్న విద్యా కానుకలను విద్యార్థులకు సకాలంలో అందజేయాలన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్య మాట్లాడుతూ.. నాడు-నేడు పనుల్లో జాప్యం లేకుండా చూసుకోవాలని, ఏరోజు పురోగతిని ఆ రోజే యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పనులు అత్యంత భద్రత నడుమ జరగాలన్నారు. సమగ్ర శిక్షా ఏపీసీ ఆర్.జయప్రకాశ్ మాట్లాడుతూ.. నాడు-నేడు పనుల పురోగతిని రోజూ ఏంఈవోలకు తెలియజేయాలన్నారు. సమీక్షలో రణస్థలం జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైఎస్సార్‌సీపీ నాయకులు లంకలపల్లి ప్రసాద్, నాలుగు మండలాల ఎంఈవోలు ఎ.త్రినాథరావు, ఎల్.ఈశ్వరరావు, పున్నయ్య, రవి, వైఎస్సార్‌సీపీ నాయకులు మహంతి పెదరామినాయుడు, మైలపల్లి కామరాజు, జగ్గురోతు తవిటినాయుడు, టేకి బ్రహ్మజీ, లంకలపల్లి గోపి, ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

చిన్నారులకు సైకిళ్ల అందజేత



పిల్లలకు సైకిళ్లను అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద ఉన్న అనురాగ నిలయంలో చదువుకుంటున్న పలువురు అనాథ పిల్లలకు సైకిళ్లను శనివారం అందజేశారు. పిల్లలను ప్రోత్సహించేందుకు బి.వి.వి.కృష్ణకుమార్, బిందు, ఎస్.వి.ఎస్.కె.భవానీ, టి.సన్విత లు ఒక్కో సైకిల్‌ను సమకూర్చారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ.. అనురాగనిలయంలో ఉంటున్న వారికి అమ్మ,నాన్న, తాత, అమ్మమ్మ, నాన్నమ్మ లేక చదువుకు దూరం అవుతున్న తరుణంలొ రెడ్‌క్రాస్ చేరదీసి ఆలనాపాలనా చూస్తోందన్నారు. దాతలు మానవత్వంతో స్పందించి విరాళాలు ఇచ్చి పిల్లల విద్యాభివృద్ధికి సహకరించాలని కోరారు. దాతలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అనురాగ నిలయం కమిటీ సభ్యులు నిక్కు అప్పన్న, కల్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు.

నేడు మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

జి.సిగడాం: స్థానిక మోడల్ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి పరీక్ష జరగనుందని ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యూల్ లెంక శనివారం తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్‌తో పరీక్షకు హాజరు కావాలన్నారు.

ఆలయాల నిర్మాణంతో భక్తిభావం



పంచముఖ ఆంజనేయ స్వామి సన్నిధిలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

జలుమూరు: గ్రామాల్లో ఆలయాల నిర్మాణాల వల్ల శాంతి, భక్తిభావంతోపాటు లోక కల్యాణం జరుగుతుందని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. బసివాడలో నిర్మాణం జరిగిన పంచముఖ ఆలయంలో ఆంజనేయ స్వామిని శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. గ్రామాల్లో హోమాలు, పూజలు జరిగి పాడి పంటలు బాగా పండుతాయన్నారు. ఎంపీపీ వాన గోపి, అల్లాడ సొసైటీ అధ్యక్షుడు ఎం.శ్యామలరావు, పార్టీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, సర్పంచ్ బుద్దల శ్రీనివాస్, ఎంపీటీసీ బండి ఎర్రన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సహారా ఇండియా ఖాతాదారుల ధర్నా



ధర్నా చేస్తున్న ఖాతాదారులు, ఏజెంట్లు

పాతపట్నం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి కూడలి వద్ద ఉన్న సహారా ఇండియా కార్యాలయం వద్ద పాలసీదారులు, ఏజెంట్లు శనివారం ధర్నాకు దిగారు.

గత పదేళ్లుగా ఖాతాదారులకు సహారా ఇండియా నుంచి ఆర్థికపరమైన చెల్లింపులు జరగడం లేదని సహారా అధికారులను నిలదీశారు. సహార ఇండియా అధినేత సుబ్రతాయ్ పుట్టిరోజు సందర్భంగా పాతపట్నం సహారా కార్యాలయానికి చేరుకుని ధర్నా చేశామని ఏజెంట్లు, పాలసీదారులు తెలిపారు. గడువు ముగిసిన పాలసీదారులకు వెంటనే చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు.